# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ : 06-10-2023** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఉగ్రవాదంపై పోరులో అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర సహకారం అవసరమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు.**

**2.** **ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని హోంమంత్రి తానేటి వనిత పేర్కొన్నారు.**

**3.** **ఖరీఫ్ సీజన్ ముగిసిన నేపథ్యంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఈ నెల 10వ తేదీకల్లా పూర్తిచేయనున్నట్లు వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ సి. హెచ్.హరికిరణ్ తెలిపారు.**

**4.** **భారత రిజర్వ్ బ్యాంక్-ఆర్‌బీఐ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాల్గవ ద్రవ్య విధాన నిర్ణయాలను ప్రకటించింది.**

**5.** **రాష్ట్రంలో ఎస్‌ఐ పోస్టుల భర్తీ కోసం ఈనెల 14, 15 తేదీల్లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని పోలీస్ నియామక మండలి నిర్ణయించింది.**

**==========================**

ఉగ్రవాదంపై పోరులో అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర సహకారం అవసరమని... ఉగ్రవాద వ్యతిరేక వ్యవస్థపై నమూనాను జాతీయ దర్యాప్తు సంస్థ-ఎన్ఐఏ పరిధిలో రూపొందించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఎన్ఐఏ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగే ఉగ్రవాద వ్యతిరేక సదస్సులో ఆయన ఈరోజు ప్రసంగించారు. ఉగ్రవాదులతో ముడిపడిన వ్యవస్థలన్నింటినీ పూర్తిగా నిర్వీర్యం చేయాలని... దీనికోసం ఒకే స్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. దేశంలో కొత్తగా ఉగ్రవాద సంస్థలు తయారవని రీతిలో చర్యలు తీసుకోవాలని.. ఉగ్రవాద నిరోధక దళాలు ఈ దృక్పథంతోనే పనిచేయాలని అన్నారు. ఎన్ఐఏతో పాటు ఉగ్రవాద వ్యతిరేక దళాలు, రాష్ట్రస్థాయిలో కార్యదళాలు తమ పరిధిని కేవలం దర్యాప్తు వరకే పరిమితం చేయకుండా, వినూత్నంగా ఆలోచించాలని దిశానిర్దేశం చేశారు. దర్యాప్తులో ప్రామాణిక నిర్వహణ విధానాలు, వ్యవస్థ తీరు అన్ని రాష్ట్రాల్లో ఒకే రీతిలో ఉంటే కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయం మెరుగుపడుతుందని అమిత్ షా వివరించారు.

-------------------------

రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సమావేశంలో పాల్గొన్నారు. ప్రభావిత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్‌లలో చేపట్టాల్సిన జాయింట్ ఆపరేషన్‌లపై ఈ సందర్భంగా చర్చిస్తున్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి పనులపై మౌలిక వసతుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించనున్నారు. నక్సల్ సమస్య పరిష్కారానికి

పోలీసు బలగాల ఆధునీకరణ, మెరుగైన మౌలిక వసతులు, రిజర్వ్ బెటాలియన్ ఏర్పాటు, హెలికాప్టర్లు, యూఏవీలు తదితర అంశాలపై చర్చించనున్నారు. సమావేశానంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం కానున్నారు.

---------------------------

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని హోంమంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా చంద్రవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నట్లు తానేటి వనిత పేర్కొన్నారు.

---------------------------

ఖరీఫ్ సీజన్ ముగిసిన నేపథ్యంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఈ నెల 10వ తేదీకల్లా పూర్తిచేయనున్నట్లు వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ సి.హెచ్.హరికిరణ్ తెలిపారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ...ఇప్పటికే 97 శాతం ఈ-క్రాప్ నమోదు, 70 శాతం రైతుల ఈ-కేవైసీ నమోదు పూర్తయ్యాయని... మిగిలిన 30 శాతం మంది రైతులతో ఈ నెల 10వ తేదీ కల్లా ఈ-కేవైసీ పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అక్టోబర్ రెండోవారంలో జమచేయనున్న పీఎం కిసాన్ 15వ విడత సాయం కోసం.. అర్హతగల రైతులందరూ ఆధార్‌తో భూమి రికార్డులు, బ్యాంకు ఖాతాలు, ఈ-కేవైసీ తప్పనిసరి చేసిన నేపథ్యంలో వాటిని సరిచేసుకోవాలని సూచించారు. ప్రతి మండలానికి కిసాన్ డ్రోన్ల ఏర్పాటులో భాగంగా గుర్తించిన రైతు పైలట్‌ల శిక్షణ కోసం జారీచేసిన మార్గదర్శకాలను మరింత సులభతరం చేస్తామని హరికిరణ్ పేర్కొన్నారు.

---------------------------

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో విచారణ కొనసాగుతోంది. ఇరుపక్షాల వాదనలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు నాయుడు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే, సీఐడీ తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు.

---------------------------

ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలోని ఏరుపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను మంత్రి పరిశీలించి.. ప్రజలకు చేస్తున్న పరీక్షలు, అందిస్తున్న మందులు, ఓపీ తదితర వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో వైద్య సేవలు అవసరమైన వారందరికీ 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం ద్వారా ఇంటి వద్దకే రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ వైద్యం తీసుకు వస్తోందన్నారు.

---------------------------

భారత రిజర్వ్ బ్యాంక్-ఆర్‌బీఐ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాల్గవ ద్రవ్య విధాన నిర్ణయాలను ఈ రోజు ప్రకటించింది. గవర్నర్ శక్తికాంత దాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... కీలకమైన రెపో రేటును 6.50 శాతం వద్ద యథాతథంగా కొనసాగించనున్నట్లు తెలిపారు. వడ్డీ రేట్లను మార్చకుండా అలాగే కొనసాగించడం వరుసగా ఇది నాలుగోసారి. ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ లక్ష్యం 4 శాతమని పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు సవరిస్తామన్నారు. సెప్టెంబరులో ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉందని

తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు అంచనా 6.5 శాతంగా ఉందని... ప్రైవేట్ రంగంలో మూలధన వ్యయం పుంజుకుంటోందని శక్తికాంత్ దాస్ తెలిపారు. ఆస్తుల నాణ్యత మెరుగైన నేపథ్యంలో భారత బ్యాంకింగ్ వ్యవస్థ బలం సంతరించుకుంటోందన్నారు. సెప్టెంబరు 29 నాటికి దేశ విదేశీ మారక నిల్వలు 586.9 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెదగనగళ్లవానిపేటలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ సచివాలయం ద్వారా అన్ని ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. పరిపాలనను మరింత స్థానికం చేసి, ప్రజలకు మరింత వెసులుబాటు కలిగించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఇందులో భాగంగా గ్రామ సచివాలయ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం ఈనెల 14, 15 తేదీల్లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని పోలీస్ నియామక మండలి నిర్ణయించింది. ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లు, డిస్క్రిప్టివ్ విధానంలో రెండు పేపర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. మెయిన్స్ పరీక్షలను విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలు కేంద్రాల్లో నిర్వహించనున్నారు. మెయిన్స్‌కు మొత్తం 31,193 మంది అభ్యర్థులు అర్హత సాధించగా.. వారిలో పురుషులు 27,590 మంది, మహిళలు 3,603 మంది ఉన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను ఈ నెల 6 నుంచి 12 వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని రాష్ట్ర పోలీసు నియామక మండలి చైర్మన్ అతుల్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. slprb.ap.gov.in వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని... ఏమైనా సందేహాలుంటే 9441450639, 9100203323 నంబర్లను లేదంటే slprb@ap.gov.in మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

---------------------------

'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. నవంబర్ 15వ తేదీ నుంచి నిర్వహించనున్న ఈ క్రీడల నిర్వహణకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్లను కలెక్టర్ పరిశీలించి... క్రీడా ప్రాధికారి సంస్థ అధికారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామ స్థాయి నుంచి యువతలో క్రీడా స్ఫూర్తిని వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే క్రీడాకారులుగా వారిని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలను నిర్వహిస్తోందన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోతో సహా ఐదు క్రీడాంశాల్లో పోటీలకు సంబంధించి క్రీడా పరికరాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. జిల్లాలో నవంబర్ 15 నుంచి డిసెంబర్ 21వ తేదీ వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడలలో అధిక సంఖ్యలో పాల్గొనేలా క్రీడాకారులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

---------------------------

విజయనగరం జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ఎన్నో ప్రయోజనాలు కల్గించే ఈ గుర్తింపు కార్డులను సచివాలయాల ద్వారా కానీ... కామన్ సర్వీసు సెంటర్ నుంచి ఉచితంగా పొందవచ్చని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా యూనివర్సల్ అకౌంట్ నంబర్-యూఏఎస్ కేటాయించి గుర్తింపు కార్డులను జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

====================